రూ.1700 కోట్లతో కోనసీమకు వాటర్ గ్రిడ్

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- రూ.8.73 కోట్లతో 12 రక్షిత మంచినీటి పథకాలకు శంకుస్థాపన

కొత్తపేట: కోనసీమ ప్రాంతానికి తాగునీటిగా శుద్ధి చేసిన గోదావరి జలం సరఫరా చేయడానికి రూ.1700 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపేట మండలం అవిడిలో రూ.3.94 కోట్లతో నిర్మించే 5 రక్షిత మంచి నీటి పథకాలకు, మోడేకుర్రులో రూ.3.18 కోట్లతో నిర్మించే 4 పథకాలకు, పైపు లైన్లకు శంకుస్థాపనతో పాటు అదే గ్రామంలో రూ.55 లక్షలతో ఇంటింటికీ కుళాయి పథకాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఖండ్రిగ గ్రామంలో రూ.1.06 కోట్లతో నిర్మించే 3 పథకాలకు, పైపులైన్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి పథకాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో కొత్తపేట, రావులపాలెం మండలాలకు సంబంధించి తాగునీరు అందించేందుకు రావులపాలెంలో రూ.66 కోట్లతో శుద్ధి చేసిన గోదావరి జలం ప్రాజెక్టు నిర్మించామన్నారు. ఆ తరహాలోనే కోనసీమ అంతటికీ శుద్ధి చేసిన గోదావరి జలం సరఫరాకు గ్రిడ్ నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద సుమారు 10 ఎకరాలు స్థల సేకరణకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి శుద్ధి చేసిన నీరు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని తాగునీరు సమస్య నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పరిష్కారం అవుతుందన్నారు. దానిలో భాగంగా నియోజకవర్గంలోని 4 మండలాల్లో సుమారు రూ.38 కోట్లతో 13 మంచినీటి పథకాలు నిర్మించామన్నారు. తాజాగా రూ 8.73 కోట్లతో కొత్తపేట మండలంలో పలు శివారు గ్రామాలకు పథకాలతో పాటు ఇంటింటికీ కుళాయి పథకంలో పైపులైన్లు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ రెడ్డి రవీదేవి, సర్పంచ్‌లు రెడ్డి చంటి, కుడుపూడి రామలక్ష్మి, దూనబోయిన నవదీప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పి.పద్మ, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వసంతవాడలో వైఎస్సార్ సీపీలో చేరికలు

ఆత్రేయపురం: మండలంలోని వసంతవాడ నుంచి వివిధ పార్టీలకు చెందిన అనేక మంది కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన సుమారు వంద మంది సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ పెన్మత్స సురేష్‌రాజు, మండల వైస్ ఎంపీపీ బంగార్రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాధవరాజు ఆధ్వర్యంలో గోపాలపురంలోని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాసానికి చేరుకుని వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

జగనన్న పథకాలతో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం

- గంటిలో 508 మంది మహిళలకు ఇళ్ల పట్టాల పంపిణీ


అవిడిలో డ్వాక్రా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని అవిడి, గంటి, ఖండ్రిగ, మోడేకుర్రు గ్రామాల్లో 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అవిడిలో నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా జగనన్న నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. 6,333 డ్వాక్రా సంఘాలకు రూ.219.60 కోట్లు రుణమాఫీతో జిల్లా వ్యాప్తంగా కొత్తపేట నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇది మనకు ఎంతో గర్వకారణమన్నారు. అలాగే ఏ నియోజకవర్గంలో ఇవ్వని విధంగా 17,685 మంది మహిళల పేరున ఇళ్ల స్థలాలు రిజిస్టేషన్ చేసి ఇచ్చామన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌కు మరోసారి ఆశీర్వదించాలని మహిళలను జగ్గిరెడ్డి కోరారు. అనంతరం 488 డ్వాక్రా గ్రూపులకు రూ.6.08 కోట్ల నమూనా చెక్కు అందజేశారు. సభకు వచ్చిన మహిళల్లో 100 మందిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి, ఎమ్మెల్యే తన సోదరి శైలజ చేతుల మీదుగా వారికి కుక్కర్లు అందజేశారు. అనంతరం మహిళలందరికీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు వడ్డించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీలు గూడపాటి రమాదేవి, కుడుపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, కుడుపూడి రామలక్ష్మి, సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గంటి గ్రామంలో 351 మందికి, అవిడి పంచాయతీ పరిధిలోని రెండు ప్రాంతాల్లో 157 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పట్టాతో పాటు జగ్గిరెడ్డి వ్యక్తిగతంగా పసుపు, కుంకుమ, గాజులు, రవిక అందజేశారు. నియోజకవర్గంలో 343.98 ఎకరాలు భూమి సేకరించి, 17,190 మందికి, ఈ మండలంలో 3,980 మందికి పట్టాలుగా ఇవ్వడం సరికొత్త రికార్డు అని అన్నారు.

జగన్‌కు మీ ఆశీర్వాదాలు అందించండి

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ సహకారం అందించి, మీ ఆశీర్వాదాలు అందించండి' అంటూ జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. ఆయన మంగళవారం పాశర్లపూడిలంకలో పర్యటించారు. ప్రజల్ని కలుసుకుని వారితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మోస పూరిత హామీలతో మిమ్మల్ని మోసం చేసేందుకు ప్రతిపక్షాలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో ప్రజల్ని వేధించిన జన్మభూమి కమిటీలు కావాలో, ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వలంటీర్లు కావాల్లో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వేణుగోపాలరావు సూచించారు. ఎన్నికల్లో తప్పు చేస్తే దానికి అయిదేళ్ల మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మీలో ప్రతి కుటుంబానికి జరిగిన మేలును దృష్టిలో ఉంచుకుని మరింత అభివృద్ధి, సంక్షేమం కోసం జగన్ సర్కారుకు అండగా నిలవాలని కోరారు. గ్రామంలోని పలు చోట్ల రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సామాజికవేత్త పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ నేతలు జక్కంపూడి తాతాజీ, బాలం రమేష్, ముత్యాల నర్సింహారావు, బొరుసు నర్సింహమూర్తి, పొలమూరి గోపాల్, ముత్యాల సత్యనారాయణ, కుడుపూడి రామకృష్ణ, పెదమల్లు ప్రతీక్, తదితరులు పాల్గొన్నారు.


పాశర్లపూడిలంకలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

జగనన్న కోసం సైనికుల్లా పనిచేద్దాం

అంబాజీపేట: రాబోయే ఎన్నికల్లో జగనన్న కోసం అందరం కలసి సైనికుల్లా పనిచేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొద్దామని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ముక్కామలలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం మంగళవారం జరిగింది. వేణుగోపాలరావుతో పాటు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే అవుతుందన్నారు. అనంతరం నూతనంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో వలంటీర్లకు ప్రత్యేక స్థానం

అయినవిల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలనలో వలంటీర్లకు ఒక ప్రత్యేక స్థానం ఉందని అందుకే ప్రజలకు సేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను రూపొందించి వారిని తమ మానస పుత్రుల్లా గౌరవం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అయినవిల్లి ఎంపీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా వ్యవహరిస్తూ వారి కష్టసుఖాల్లో సేవలందిస్తున్నారన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఎవరికి వారు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడేవారన్నారు. అటువంటి సమయంలో మేమున్నాం అంటూ వలంటీర్లు అందించిన సేవలు అమోఘమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లదే క్రియాశీలక పాత్ర ఉంటుదన్నారు. అనంతరం మండలంలోని క్రాప గ్రామానికి చెందిన నక్కా శివప్రసాద్, చీకురుమెల్లి రాజేశ్వరిని సేవావజ్ర అవార్డుతో, కె.జగన్నాథపురానికి చెందిన పులవర్తి దేవి, క్రాపకు చెందిన నక్కా దుర్గాదేవి, నేదునూరు–2కు చెందిన అయితాబత్తుల రవిరాజు, శానపల్లిలంక గ్రామానికి చెందిన నక్కా రాంబాబు, విలస–2కు చెందిన ముంగండ జ్యోతి సేవారత్న అవార్డుతో, మరో 350 మంది వలంటీర్లను సేవా మిత్ర అవార్డులతో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించారు. వీరికి అవార్డుతో నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, రావూరి వెంకటరామారావు, వాసంశెట్టి తాతాజీ, బొంతు రాజేంద్ర ప్రసాద్, చెట్ల రామారావు తదితరులు ఉన్నారు.


వలంటీర్లను సత్కరిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు

సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పి.గన్నవరం: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లోని పలు సమస్యలను ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. పంట కాలువల్లో తూడును తొలగించాలని, పి.గన్నవరం కొత్త అక్విడెక్టుపై ఏర్పడ్డ గోతులను పూడ్చాలని సభ్యులు కోరారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందని, ఈ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, ఎంఈఓ కోన హెలీనా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలోని గుబ్బలవారిపాలెంలో మంగళవారం తాటాకింటికి నిప్పంటుకుని రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. దీనికి సంబంధించి స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుబ్బల రామకృష్ణకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి బూడిదైంది. ఈ ఇంటిలో శ్రీకాకుళానికి చెందిన కొబ్బరి దింపు కార్మికులు అద్దెకు ఉంటున్నారన్నారు. ఈ అగ్నిప్రమాదంలో దింపు కార్మికుల వస్తువులు, రామకృష్ణకు చెందిన గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి రక్ష


గంగలకుర్రులో రోగులకు మెడికల్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు సచివాలయం వద్ద సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం శిబిరానికి హాజరైన రోగులకు మెడికల్ కిట్‌లను ఎమ్మెల్యే చిట్టిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ నెల్లి పండు, జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి నాగన్న, పితాని కాశీ, మట్టపర్తి హరి, బొక్కా సత్యనారాయణ, బొంతు శ్రీనివాసరావు, పలివెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేదల సంపూర్ణ ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) ప్రవేశ పెట్టి రెండో విడత నిర్వహిస్తుందని ప్రభుత్వ ప్రత్యేక వైద్య నిపుణుడు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన, పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని పినపళ్లలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యుల నేతృత్వంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సంగిత సుభాష్ ప్రారంభించారు. 230 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్లు ఆర్.నాగేశ్వర రావు, వి.సుబ్బారావు, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు. గ్రామంలోని కొన్ని శివారు ప్రాంతాల్లో కొంతమంది రహదారుల పక్కన బహిరంగ మల విసర్జన చేయడం వల్ల అనేక అనర్థాలు, రుగ్మతలు సంభవిస్తాయని సర్పంచ్ సంగిత సుభాష్, వైద్యాధికారి సాయి కిషోర్, సీహెచ్‌ఓ పి.రాధా కృష్ణ అన్నారు. దీనివల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆందోళన చెందారు. దీనిపై గ్రామ పంచాయతీ, వైద్యారోగ్యశాఖ ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన, బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వైభవంగా విశ్వేశ్వరుడి కల్యాణం


మాచవరంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా జరిపారు. స్వామికి అంకురారోహణ, ధ్వజారోహణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దూళిపాళ్ళ ప్రవీణ్‌శర్మ, రాణి ప్రవీణ్‌శర్మల పర్యవేక్షణలో భువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నామన్నారు. 24న త్రిశూల స్నానం, 25న స్వామివారి పుష్ప ఉత్సవ వేడుకలను జరపనున్నామన్నారు.

ఘనంగా జనార్దనస్వామి రథోత్సవం

ఆలమూరు: భీష్మ ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని ఆలమూరులో శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన రథోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, సన్నాయి వాయిద్యాలు, బ్యాండు మేళ, తాళాల మధ్య ఈ రథయాత్ర కొనసాగింది. పరిసర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి రథయాత్రలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఎల్.శ్రీనునాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఈవో సీహెచ్ సత్యనారాయణ, సర్పంచ్ నేలపూడి లావణ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

వైభవంగా ఆలయ పునః ప్రతిష్ఠ

మామిడికుదురు: ప్రజా విరాళాలతో నిర్మించిన ఈదరాడ గ్రామ దేవత పొల్లమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు పూజలను వైభవంగా జరిపించారు. పలువురు దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ గురువారం వరకు ప్రతిష్ఠా మహోత్సవాలు ఆలయ పునః నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు. పెదపట్నంలంక భద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వరస్వామి ఆలయం వద్ద శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. పలువురు దంపతులు వ్రతాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలోని షిరిడీ సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం దీపాలను వెలిగించారు. సత్సంగం, భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మామిడికుదురు: జాతీయ తైక్వాండో పోటీల్లో నగరం ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. రుద్రమదేవి మెగా కప్ పేరిట 4వ జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్–2024 పోటీలు ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగాయి. ఈ పోటీల్లో బిక్కిన రేష్మ, దొండపాటి మెల్విన్ పాల్, ఇల్లూరి ప్రతీక్, శీలం కార్తిక్ వెంకటసాహి సత్తా చాటి మొదటి స్థానం సాధించారని స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ సత్యనారాయణ, కాలేజీ ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం గుబ్బల మౌనికాదేవి అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ ఎం.శ్రీనును అభినందించారు.

శ్మశాన వాటికల ఆధునీకరణ

మామిడికుదురు: జిల్లాలో రూ.23 లక్షలతో ముస్లిం శ్మశాన వాటికలను ఆధునీకరిస్తున్నామని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదిర్ చెప్పారు. మామిడికుదురులో రూ.5 లక్షల ఎంపీ నిధులతో చేపట్టనున్న శ్మశాన వాటిక పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ తన నిధుల నుంచి ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ముస్లింల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అంబాజీపేట, కొత్తపేట, తాండవపల్లి, మామిడికుదురు శ్మశానవాటికలకు ఒక్కో శ్మశాన వాటికకు రూ.5 లక్షలు వంతున, అల్లవరం శ్మశాన వాటికకు రూ.3 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులను ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో ముస్లింలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీకి ముస్లింలు అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, డైరెక్టర్లు ఎండీవై షరీఫ్, ఎండీ రబ్బాని, కర్రార్ హుస్సేన్, కార్యదర్శి జాఫర్ హుస్సేన్, మత ప్రబోధకుడు షబ్బీర్ అలీజైదీ, కోఆప్షన్ సభ్యుడు నూరైన్ అబ్బాస్ పాల్గొన్నారు.

నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: చర్చికి నిప్పు అంటించిన నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వద్దిపర్రులో కాలువరేవు వద్ద పాస్టర్ మోషేన్ చర్చికి ఆదివారం రాత్రి దుండగులు నిప్పు అంటించిన విషయం తెలుసుకుని మంగళవారం వచ్చిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి నిందితులు ఎవరైనా సరే త్వరగా పట్టుకుని కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పాస్టర్ మోషేన్‌తో మాట్లాడి చర్చి పునర్నిర్మాణానికి రూ.50 వేల ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న ఆలోచనలు ప్రజా సేవ వైపే..

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు ఎప్పుడూ ప్రజా సేవపైనే ఉంటాయని, ఈ క్రమంలో సచివాలయ వ్యవస్థ పుట్టుకొచ్చిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, కె.పెదపూడి, ముక్కామల సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, బండారు వెంకటలక్ష్మి అధ్యక్షతన నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రహదారుల నిర్మాణానికి భూమి పూజలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గంగలకుర్రులో నూతనంగా నిర్మించిన వెల్నెస్ సెంటర్, గంగలకుర్రు అగ్రహారంలో ఆర్బీకే, ముక్కామలలో గ్రామ సచివాలయ భవనాల్ని నిర్మించామన్నారు. కె.పెదపూడి శివారు కుడుపూడివారిపాలెంలో ఓఎన్‌జీసీ నిధులు రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రదాత జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీలు విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంఎం శెట్టి, విత్తనాల శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రావులపాడు ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేయబతుందన్నారు. గ్రామంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామని నగరం ఎస్సై పి.సురేష్ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులతో పాటు రూ.1,750 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి


మాకనపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఓ బోసుబాబు

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు పేర్కొన్నారు. ఈయన మంగళవారం ఈదరాడ, మాకనపాలెం గ్రామాల్లో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయాన్ని ఏఓలు కె.శ్రీనివాస్, బి.మృదులతో కలసి పరిశీలించారు. మాకనపాలెంలో రైతు నయనాల శ్రీరంగనాథం కొబ్బరి తోటలో అంతర పంటలు, తైవాన్ జామ, పోక పంటలను పరిశీలించారు. ఈదరాడలో యెరుబండి లక్ష్మయ్య వరి, కొబ్బరి, యెరుబండి భాస్కరనాగేశ్వరరావు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. బోసుబాబు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలను వాడడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏఎస్‌లు రమ్య, శ్రీలక్ష్మి, దినేష్, ఈదరాడ యూనిట్ కేడర్స్ కె.జానకి, సీహెచ్ రాధ, కె.పద్మ, జి.లెనిన్, కె.స్వాతి నాగదుర్గ పాల్గొన్నారు.

కనులపండువగా నృసింహుని రథోత్సవం


ఊడిమూడిలో శ్రీలక్ష్మి నరసింహస్వామికి నిర్వహిస్తున్న కల్యాణం


అంతర్వేదిలో రథంపై కొలువైన కల్యాణమూర్తులు


అంతర్వేదిలో పల్లకి నుంచి రథంపైకి స్వామిని అధిరోహింపజేస్తున్న అర్చకులు

- జనసంద్రంగా అంతర్వేది
- సముద్రంలో పుణ్యస్నానాలు
- దర్శనానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి/అయినవిల్లి/పి.గన్నవరం/కొత్తపేట: అంతర్వేది పుణ్యక్షేత్రం జయవారం రథోత్సవం జన సంద్రమైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక లక్ష్మీనృసింహస్వామి కల్యాణ తంతు ముగిసిన అనంతరం భక్తులు నేరుగా సముద్ర తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులతో తీరం జనసంద్రమైంది. నమో నారాయణ అంటూ స్వామిని కీర్తించారు. జయవారం మధ్యాహ్నం 2.05 గంటలకు నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. రథానికి భక్తులు అరటి గెలలు, గుమ్మడి కాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రథయాత్ర పొడవునా భక్తులు రథం తాళ్లు పట్టుకుని రథాన్ని ముందుకు లాగుతూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. తీర్థంలో భక్తులు ఉల్లాసంగా గడిపారు. అయినవిల్లి మండలంలోని చింతనలంకలో కొలువైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి, వీరవల్లిపాలెంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామి వార్ల కల్యాణం మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పి.గన్నవరం మండలంలో చిన అంతర్వేదిగా పేరుగాంచిన ఊడిమూడిలో వేంచేసిన లక్ష్మీ నర్సింహస్వామి వారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. రాత్రి స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. కొత్తపేట మండలంలోని ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానం క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి వారి కళ్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.